ఈ-క్రాప్‌తో రైతుకు చేయూత

రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. అన్నదాతల మేలు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దీంతో పాటు వివిధ రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రైతన్నలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తోంది. రైతన్న కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ఇందులో ఈ క్రాప్ నమోదు ఒకటి. రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవడం ద్వారా అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

- పలు రకాల ప్రయోజనాలు
- వేగంగా ఖరీఫ్ పంటల నమోదు
- ఇప్పటి వరకు 97శాతం పూర్తి


పంట నమోదు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

సూళ్లూరుపేట రూరల్: ఈ క్రాప్ నమోదుతో ప్రభుత్వం రైతుకు అడుగడుగునా అండగా నిలుస్తోంది. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రా(ఆర్‌బీకే)లు ఏర్పాటు చేసి విత్తనం మొదలుకుని పంట దిగుబడి చేతికొచ్చే వరకు అన్ని రకాల సేవలందిస్తోంది. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందించాలనే లక్ష్యంతో ఈ క్రాప్ ఆరంభించింది. పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా రైతులు ఏయే పంటలు సాగు చేశారు. ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే వివరాలను వ్యవసాయ అధికారులు ఈ క్రాప్‌లో నమోదు చేస్తున్నారు.

వేగంగా పంట నమోదు ప్రక్రియ

మండలంలో 19 పంచాయతీలు, 8 సచివాలయాలు, 10 ఆర్బీకేల పరిధిలో సుమారు 9,764 మంది రైతులు ఉన్నారు. మొత్తం 5,542 హెక్టార్లలో వరిసాగు చేస్తుంటారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో 2,342 మంది వరి సాగు చేస్తున్నారు. 750 మంది కౌలు రైతులు ఉండగా, 384 మందికి గుర్తింపు కార్డులు అందించారు. గ్రామాల వారీగా రైతు భరోసా కేంద్రాల్లో ఉన్న వీఏఏ, వీఆర్వోలు వేగంగా ఈ పంట నమోదు చేస్తున్నారు. వరి సాగు చేసిన పొలం వద్దనే రైతు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు చేశారు? ఏ రకం పంట వేశారు? అనే విషయాలపై పొలం వద్దనే రైతుల ఫొటోల తీసి వెబ్‌ల్యాండ్‌లో పొందుపరుస్తున్నారు. ఆధార్, బ్యాంకు ఖాతా, ఫోన్‌నంబర్లు, భూమికి సంబంధించిన వివరాలతో ఈకేవైసీ ప్రకియ నమోదు చేస్తారు. అనంతరం రైతుల జాబితాను మండల స్థాయి రెవెన్యూ, వ్యవసాయ అధికారులకు అందజేస్తారు. అలాగే జిల్లా ఉన్నత అధికారులు వివరాలను పరిశీలించి తుది జాబితాను విడుదల చేస్తారు. ఇప్పటి వరకు సూళ్లూరుపేట మండలంలో 97శాతం ఈ పంట నమోదు పూర్తి చేశారు.

లాభాలు ఇలా..

- పంట నమోదు వల్ల వరదలు, తుపాన్ల సమయంలో పంటలకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం నుంచి ఇన్‌పుట్ సబ్సిడీ అందుతోంది.
- పంటల బీమా కావాలన్నా, సున్నా వడ్డీకి పంట రుణాలు కావాలన్నా రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు తీసుకోవాలన్నా ఈ క్రాప్‌లో నమోదు తప్పనిసరి
- పండించిన పంట ఉత్పత్తులను ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవాలన్నా ఈ క్రాప్ చేసి ఉండాలి.
- భవిష్యత్‌లో ఈ–పంట నమోదు ఆధారంగా ఎరువులు, విత్తనాలు అందించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.
- రైతు భరోసాకు ఈ పంట నమోదు అవసరం.
- కౌలు రైతులు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లకు తమ వివరాలు అందజేసి పంట నమోదు చేసుకోవచ్చు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ఆలయ ట్రస్టు బోర్డు చైర్ పర్సన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ ఏర్పాట్లు చేశారు.

పెదపాళెపమ్మకు అంబళ్లు


అమ్మవారికి అంబలి సమర్పిస్తున్న భక్తులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ఎల్‌ఏ సాగరం చెరువు కట్టపై ఉన్న పెదపాళెపమ్మ ఆలయ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఓం శక్తి మాల ధరించిన భక్తులు ఇరుముడి చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి అంబళ్లు సమర్పించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం జరిగింది.

భక్తులకు రుద్రాక్ష మాలలు పంపిణీ


రుద్రాక్ష మాలలు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

వాకాడు: మండలంలోని బాలిరెడ్డిపాళెం ఆముదాలపాడు వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో సీతారామ ధార్మిక సేవా సంస్థ భక్తులకు ఆదివారం రుద్రాక్ష మాలలు పంపిణీ చేసింది. రామిరెడ్డి వెంకటరామిరెడ్డి, హైమావతమ్మ దంపతులు సుమారు రూ. 10 వేలు విలువ చేసే పంచముఖి రుద్రాక్ష మాలలు అందజేశారు. ప్రధాన అర్చకుడు దీవి అనంతాచార్యులు మాట్లాడుతూ.. పరమేశ్వరుడికి ప్రతిరూపంగా చెప్పుకునే రుద్రాక్ష మాలలను ధరించడం వల్ల పవిత్రతతోపాటు ద్విగుణీకృతమైన ఫలితాలు లభిస్తాయన్నారు.

దివ్యాంగులకు సరుకుల పంపిణీ


సరుకులు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

గూడూరురూరల్: గూడూరు సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ ఆడిటోరియంలో ఆదివారం దివ్యాంగులకు ఫలసరుకులను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి ధనుంజయరెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో సేవా కార్యక్రమాలు విస్తృతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మధుసూదన్‌రెడ్డి, దశరథరామిరెడ్డి, ప్రజేంద్ర రెడ్డి, డాక్టర్ హరికారెడ్డి, భాస్కర్‌రెడ్డి, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహం


విద్యార్థికి చెక్కు అందజేస్తున్న నల్లపరెడ్డి

కోట: శ్రీశిరిడీసాయి అక్షయ సేవాసమితి సహకారంతో ఆదివారం పేద విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. స్థానిక కోటమ్మ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ ఏడాది పది, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన 41 మందికి రూ.5 వేలు చొప్పున సాయం అందించారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. సేవా సమితి కన్వీనర్ అల్లం రమణయ్య, కోటేశ్వరరెడ్డి, సుబ్బయ్య, గిరిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాపూరులో బీఎల్‌ఏలతో సమావేశం నేడు

రాపూరు: మండల బూత్ లెవల్ ఏజెంట్‌లతో రాపూరు తెలుగుగంగ అతిథి గృహం వద్ద సోమవారం సమావేశం నిర్వహించనున్నట్లు మండల జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, తదితరులు హాజరుకానున్నారని చెప్పారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

గ్రామదేవతకు సారె సమర్పణ


పొంగళ్లు పెడుతున్న మహిళలు

చిల్లకూరు: మండల తీర ప్రాంతంలోని పొన్నవోలు గ్రామ దేవత నీలారిగన్నెమ్మకు ఆదివారం సారె సమర్పించి సామూహిక పొంగళ్లు పెట్టారు. మూడు రోజులుగా అమ్మవారి ఆలయంలో పూజలు జరుగుతున్నాయి. చివరి రోజు మహిళలు అమ్మవారికి సారె, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పండరి భజనలు ఆకట్టుకున్నాయి. వైఎస్సార్‌సీపీ నాయకులు బుర్లా విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్ తమ్మిశెట్టి ముత్యాలమ్మ పర్యవేక్షించారు.

పిల్లలకు అన్నదానం

పెళ్లకూరు: నాయుడుపేటలోని చేయూత అనాథాశ్రమ పిల్లలకు పెళ్లకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత పేరం మధునాయుడు ఆదివారం అన్నదానం చేశారు. తన కుమారుడు పేరం వెంకట్‌తేజ పుట్టిన రోజు సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి స్వీట్లు పంచి పెట్టారు.

కోలాహలంగా గంగమ్మ కొలుపు


విశేషాలంకరణలో గంగమ్మ


పెంగళ్లు పెడుతున్న భక్తులు

రాపూరు: మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయంలో ఆదివారం గంగమ్మ కొలుపు ప్రారంభమైంది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ ప్రదక్షిణ చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ


మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

దొరవారిసత్రం: తనియాలి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత యద్దల మునీంద్రరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదివారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట సూళ్లూరుపేట చెంగాలమ్మ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కళ్లత్తూరు రామ్మోహన్‌రెడ్డి, నాయకులు భాస్కర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు ఉన్నారు.

అంతర్ పంటలతో ఆదాయం


నిమ్మ పంటలో అంతర్ పంటగా సాగు చేసిన కాకర

చిల్లకూరు: ఉద్యాన రైతులు అంతర్ పంటలు సాగు చేస్తూ అధిక ఆదాయం పొందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిమ్మ పంట సాగు చేసే రైతులు మొక్కల మధ్యలో ఆకుకూరలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. వీటి వల్ల పెట్టిన పెట్టుబడులు కొంతైన తగ్గించుకోవచ్చని అంటున్నారు. దీర్ఘకాలిక పంటలైన నిమ్మ మూడు ఏళ్లకు కాపుకు వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రైతులు ఆకుకూరల వైపు ఎక్కువగా మొగ్గ చూపుతున్నారు. నిమ్మ సాగు చేసే కొందరు రైతులు అంతర్ పంట సాగు చేసుకునేందుకు ముందుకు వచ్చే రైతులకు కౌలుకు ఇస్తున్నారు. దీని వల్ల తమ పంట సాగు చేసుకోవడంతో పాటుగా కౌలుకు తీసుకున్న రైతులు కొంత మొత్తం చెల్లిస్తుండడంతో అటు వైపుగా ఆదాయం ఉంటుందని అంటున్నారు. ఈ క్రమంలోనే మండలంలోని ఓడూరు, నెబల్లిరెట్టపల్లి, కడివేడు, తొణుకుమాల గ్రామాల్లో ఇలా అంతర్ పంటలు సాగు చేస్తున్నారు.

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం


భారతమాత చిత్ర పటానికి పూజలు చేస్తున్న మహిళలు

సూళ్లూరుపేట రూరల్: మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేందుకు విశ్వహిందూ పరిషత్ కృషి చేస్తున్నట్లు మురళీరెడ్డి అన్నారు. సూళ్లూరుపేట పట్టణంలోని సత్యసాయి బాబా మందిరంలో మహిళలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకునేలా పల్లెల్లో తిరిగి చైతన్య పరచాలని సూచించారు. హిందూ ధర్మంలో స్త్రీలకే ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నేతలు వెంకట రమణ, సుంకర ప్రతిమ, కమ్మిరెడ్డి, గోపి, ఉషా, అన్నపూర్ణ పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు.. నిర్లక్ష్యం చేస్తే కడుపు కోతలు!



ప్రమాదకరంగా ఉన్న ఫ్యూజ్ క్యారియర్, దెబ్బతిన్న విద్యుత్ వైర్లు

దక్కిలి: మండలంలోని వెంకటేశ్వరపురం ఎస్టీ కాలనీలో విద్యుత్ స్తంభం వద్ద వీధి దీపాల కోసం ఏర్పాటు చేసిన ఫ్యూజ్ క్యారియర్ ప్రమాదకరంగా ఉంది. స్థానిక ప్రాథమిక పాఠశాల వద్ద ఫ్యూజ్ క్యారియర్‌ను ట్రాన్స్‌కో సిబ్బంది ఏర్పాటు చేశారు. అయితే ఇక్కడి వైర్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈవైర్లు చేతికందే ఎత్తులో ఉండడం వల్ల ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు డోర్ లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇకనైనా ట్రాన్స్‌కో అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గున్నం సేవాట్రస్ట్ సేవలు అభినందనీయం

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య


చెంచుదయాకర్‌రెడ్డి, భూదేవమ్మ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి

ఓజిలి: గున్నం సేవా ట్రస్ట్ ద్వారా ప్రజలకు చేస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. ఆదివారం మండలంలోని భట్లకనుపూరు గ్రామంలో ఎమ్మెల్యే మాట్లాడారు. మండలంలోని చిలమానుచేను, ఆర్మేనిపాడు ఉన్నత పాఠశాలల్లో గున్నంసేవాట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.10 లక్షల వ్యయంతో సైన్స్ ల్యాబ్‌లను ఏర్పాటు చేశారన్నారు. భట్లకనుపూరు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలకు క్రీడాసామగ్రి, బల్లలు, ఫర్నీచర్, శిథిలావస్థకు చేరిన అంగన్‌వాడీ భవనం మరమ్మతులు చేయించి పేద పిల్లలు చదువుకునేందుకు సహాయసహకారాలు అందిస్తున్నారన్నారు. నాయుడుపేట, గూడూరు, ఓజిలి పట్టణాలకు వెళ్లి చదువుకునే విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించారని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తున్న గున్నంసేవా ట్రస్ట్ నిర్వాహకులు గున్నంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాధారెడ్డిలను ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం గున్నం రెడ్డి చెంచుదయాకర్‌రెడ్డి, భూదేవమ్మ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కట్టా సుధాకర్‌రెడ్డి, ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి, ఓజిలి, నాయుడుపేట జెడ్పీటీసీ సభ్యులు కట్టా జ్యోతిరెడ్డి, గుంటమడుగు రవీంద్రరాజు, కురుగొండ, కుందాం పీఏసీఎస్ అధ్యక్షులు రాజారామిరెడ్డి, శోభారాణి, బచ్చల రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు సచివాలయ కన్వీనర్లతో సమావేశం

ఓజిలి: మండలంలోని సచివాలయ కన్వీనర్లతో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సోమవారం సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, జెడ్పీటీసీ సభ్యుడు గుంటమడుగు రవీంద్రరాజు తెలిపారు. నాయుడుపేట జాతీయ రహదారిలోని కేఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో సమావేశం జరుగుతుందన్నారు. సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవళ్లీదేవసేన సమేత కుమారస్వామి ఆడికృత్తిక ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద ధ్వజావరోహణ పూజలు నిర్వహించారు. దీంతో ఆడికృత్తిక ఉత్సవాలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

శ్రీకాళహస్తి: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా గురువు మార్కండేయులు అన్నారు. పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో నిర్వహిస్తున్న ఉచిత యోగాశిక్షణలో భాగంగా ఆదివారం ఉదయం సూత్రనేతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రబ్బర్ ట్యూబ్ ద్వారా ముక్కు రంధ్రం నుంచి నోటిలోకి పంపి శుభ్రం చేసుకునే కార్యక్రమాన్ని సూత్రనేతి అని అంటారని చెప్పారు. దీనివల్ల దీర్ఘకాలిక జలుబు, ముక్కుకు సంబంధించిన అనేక ఇబ్బందులు తొలగుతాయన్నారు. గొంతులో పేరుకుపోయిన కఫం శుభ్రం అవుతుందని చెప్పారు. అభ్యాసకులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో ప్రముఖులు


హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు పద్మావతి అమ్మవారిని ఆదివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ దర్శించుకున్నారు. వారికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి, ఆలయ అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, ఈవో ధర్మారెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

రాపూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని తూర్పు రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ, వెంకటగిరి నియోజకవర్గ పరిశీలకుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రాపూరు మండలం సంక్రాంతిపల్లి చెన్ను గార్డెన్‌లో ఆదివారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల సంక్షేమం కోసం పనిచేసే జగన్‌మోహన్‌రెడ్డి విజయానికి అందరూ కలసికట్టుగా పనిచేయాలని కోరారు. అలాగే వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ తీసుకొచ్చేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పెంచలకోన దేవస్థానం చైర్మన్ చెన్ను తిరుపాల్‌రెడ్డి, సొసైటీ మాజీ అధ్యక్షుడు చెన్ను భాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు ప్రసన్న, ఎంపీపీ ప్రసన్న, పార్టీ నాయకులు వెంకటరమణారెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

ఈ ప్రయాణం.. ప్రమాదం


ఆటోలో ప్రమాదకరంగా వెళుతున్న ప్రయాణికులు

చిల్లకూరు: ఆ మార్గంలో ఆర్టీసీ బస్సులు అతి తక్కువ ట్రిప్పులు నడుపుతుండడంతో ప్రమాదమని తెలిసినా ప్రైవేట్ వాహనాల్లో ఇలా ప్రయాణాలు సాగిస్తున్నారు. చిల్లకూరు మండలం తీర ప్రాంతంలోని తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మ ఆలయానికి ప్రతి ఆదివారం వందలాది మంది భక్తులు వస్తుంటారు. గతంలో ఆదివారం గూడూరు డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడిపేవారు. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు బస్సులోనే ప్రయాణం చేసేవారు. అయితే కొద్ది నెలలుగా తూర్పుకనుపూరుకు ఉదయం, మధ్యాహ్నం మాత్రమే రెండు ట్రిప్పులు బస్సులు నడుపుతున్నారు. దీంతో బస్సు సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ప్రైవేటు వాహనాల్లో ఇలా ఒకరిపై ఒకరు కూర్చుని ప్రయాణాలు సాగిస్తున్నారు. గతంలో ఇదే విధంగా ప్రయాణించిన పలు వాహనాలు తిరగబడి పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇకనైనా పోలీస్, ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాల్సి అవసరం ఉంది.

ఉత్సాహంగా 3కే రన్



3కే రన్‌లో అండర్16 సౌత్‌జోన్ క్రీడాకారులు

వెంకటగిరిరూరల్: మన ఆంధ్ర, మన ఏపీఎల్ కార్యక్రమంలో భాగంగా అండర్ 16 సౌత్‌జోన్ క్రీడాకారులతో తారకరామా క్రీడా ప్రాంగణం నుంచి పట్టణంలోని కాశీపేట వరకు ఆదివారం 3కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. క్రీడలతో మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. ముఖ్యంగా క్రికెట్ లాంటి క్రీడలో ప్రతిభ చాటితే దేశవ్యాప్తంగా గుర్తింపు పొందవచ్చని చెప్పారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఏపీఎల్ ద్వారా ఎంతోమంది గ్రామీణ క్రీడాకారులను జిల్లా, రాష్ట్ర పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.